నగరంలో మెరుగైన రవాణాకు చర్యలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): హెచ్-సిటీ ద్వారా చేపట్టే ప్రాజెక్టుతో నగర పౌరులకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగేలా పనులు చేపట్టాలని, ప్రజలకు అధిక ప్రయోజనం చేకూరి, సౌకర్యవంతంగా ఉండేలా ప్రాజెక్టులను తీర్చిదిద్దాలని ఎంఏయూడీ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అధికారులను సూచించారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ప్రాజెక్ట్ (హెచ్-సిటీ) పనులపై ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ ఇలంబర్తి, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, సిటీ ప్లానర్లతో ఆదివారం సచివాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రహదారులను మెరుగుపర్చాలి

హెచ్-సిటీ ప్రాజెక్టుతో హైదరాబాద్ నగరానికి ప్రధాన సమస్యగా మారిన రహదారులను మెరుగుపరచాలన్నారు. గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ కష్టాలను తొలగించేలా, వరద ముంపును తప్పించేలా, నగరం నలుమూలలా ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్యూబీ, ఆర్వోబీలను రూ. 7,300 కోట్లతో 50 పనులను హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మూడు దశల్లో నిర్మిస్తుందన్నారు. మొదటి విడతగా రూ. 2100 కోట్లతో పనులు చేపట్టగా, ఈ పనులపై సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేసినట్లుగా తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, సిటి ప్లానర్లు బృందాలుగా ఏర్పడి గ్రేటర్ హైదరాబాద్ లో హెచ్ - సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లై ఓవర్లు, రోడ్డు విస్తరణ, అభివృద్ధితో సహా అన్ని పనులను క్షేత్ర స్థాయిలో పర్యటించి లోతుగా అధ్యయనం చేయాలని ముఖ్య కార్యదర్శి ఆదేశించారు. ఒక్కో జోన్‌కు అదనపు కమిషనర్ లేదా జోనల్ కమిషనర్ నేతృత్వంలో క్షేత్ర పరిశీలన జరగాలన్నారు.

అటకెక్కిన ఆరు గ్యారెంటీలు

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం.. నిరుద్యోగుల భృతి, వృద్ధుల పింఛన్ ఏమైంది?

- ఇందిరమ్మ రాజ్యంలో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ప్రజలు
- ఆరు గ్యారెంటీల అమలు కోసం.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దాం
- యువ వికాసం పేరిట.. యువతను నయవంచనకు గురిచేసిన సీఎం రేవంత్ రెడ్డి
- సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఝాన్సీ

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 9: నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఏమైందని, ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం అంటూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఇంటింటా శోకాన్నే మిగిల్చిందని, ఆరు గ్యారంటీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసి హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఝాన్సీ దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'ఆరు గ్యారంటీ పథకాల అమలులో అడ్డం పడిపోయిందని' సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసి తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసి మేడ్చల్ డివిజన్ కమిటీ కామ్రేడ్ శివబాబు ఆధ్వర్యంలో ఆదివారం కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ ఝాన్సీ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గెలిస్తే 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాటలు నీటిమూటలుగానే మిగిలాయని, గ్రామాల్లో ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తున్నారని అన్నారు. రైతు బంధు రూ.10 వేలు ఉంటే, మేము రూ.15 వేలు చెల్లిస్తామని రైతుల ఓట్లు వేయించుకుని రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, రైతు గోస ప్రభుత్వానికి తగులుతదని పేర్కొన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏ ఒక్కటి ఆచరణలో పెట్టకుండా గత ప్రభుత్వాన్ని నిందించడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమించి కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో జరిగే ప్రజా ప్రదర్శన బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని కోరారు. అనంతరం, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి అనురాధ, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు జయసుధ, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యామ్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రైతులకు అన్యాయం

- నెల రోజుల్లోనే రాష్ట్రంలో 15 మంది రైతుల ఆత్మహత్య
- కేంద్రమంత్రి నిర్మలా సీతా రామన్‌కు రైతులు, అభాగ్యులు కనిపించకపోవడం సిగ్గుచేటు
- రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జస్టిస్ చంద్ర కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్ర కుమార్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 9: కేంద్ర బడ్జెట్లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, అందులో ఆత్మహత్యలు చేసుకున్న వారి ఊసే లేదని రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు పంటలు పండించడంలో ఎంత కష్టపడుతున్నారో, వాటిని మార్కెట్లో విక్రయించాలంటే అంతకంటే ఎక్కువ కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర లభించక, మార్కెట్‌కు వస్తే వ్యాపారులు, దళారుల దోపిడీ వల్ల నష్టపోతున్నారని అన్నారు. దేశ వ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు జరిగితే కేంద్ర ప్రభుత్వం కనీసం వారి కుటుంబాలను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో దేశమంటే మట్టికాదోయ్ అన్న పద్యాన్ని చదివిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ కు ఈ దేశంలో రైతులు, నిరుద్యోగులు, అభాగ్యులు కనిపించలేదన్నారు. కేంద్రం ఆలోచనలో దేశమంటే అదాని అంబానీలు, విదేశీ, కార్పొరేట్ సంస్థలు అన్నట్లుగా వ్యవహరిస్తుందన్నారు. మంత్రి నిర్మల సీతారామన్ ఈ అంశంపై సిగ్గుపడాలన్నారు. రాజ్యాంగంపై ప్రమాణాలు చేసి పదవులు అనుభవిస్తున్న వారు దాని ఫలాలను అనుభవించాల్సిన రైతాంగాన్ని విస్మరిస్తున్నారన్నారు. అలాగే, కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాల్సి ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం సైలెంట్‌గా ఉండటంలో ఆంత్యమేమిటన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, ప్రతి జిల్లాల్లో ఆత్మహత్యలు జరుగుతున్నాయని, ఒక్క నెల రోజుల్లోనే 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసును అమలు చేయాలన్న ఆలోచన కేంద్రానికి లేదని, ఫలితంగా రైతాంగం నష్టపోతూ ఆత్మహత్యల పాలవుతూ వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరువాలని, రైతుల ఆత్మహత్యల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం, ఆత్మహత్యలకు పాల్పడిన పలువురు రైతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. సమావేశంలో రైతు సంక్షేమ సమితి ఉపాధ్యక్షులు అంబు రాథోడ్, నాయకులు సోమిడి శ్రీనివాస్, జనార్ధన్, సొగరా బేగం, అనంత రెడ్డి, ప్రకాశ్, స్నేహా రెడ్డి, జలంధర్, ఓదెల రాజయ్య, న్యాయవాది పవన్ తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్‌లో ఆర్థోపెడిక్ వాకథాన్

వాకథాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 9: మూనాట్ హెల్త్ కేర్ ఫౌండేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ లోని జల విహార్ వద్ద ఆర్థోపెడిక్ వాకథాన్‌ను ఏర్పాటు చేశారు. 3.5, 7 కే విభాగాల్లో ఏర్పాటు చేసిన ఈ వాకథా న్ ను మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ఎస్బీఐ జనరల్ మేనేజర్ రవికుమార్ వర్మతో కలిసి ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎముకలు బలహీనంగా ఉండటంతో పాటు వయసుపై పడుతున్న క్రమంలో కీళ్ల నొప్పులు లాంటి సమస్యలు వస్తాయన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయడం వల్ల కీళ్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. కీళ్లు ఎముకల సమస్యలపై మునాట్ హెల్త్ కేర్ ఫౌండేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్లు డాక్టర్ ప్రదీప్ మునాట్, డాక్టర్ శిల్ప, ఒక సామాజికవేత్తలు వినోద్ సంచేటి, శ్రావణ్ పాక తదితరులు పాల్గొన్నారు.

వాకథాన్ లో పాల్గొన్న యువత

గ్రేటర్‌లో పర్యటించిన బల్దియా కమిషనర్

గ్రేటర్ అధికారులతో బల్దియా కమిషనర్ పర్యటన

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): గ్రేటర్ లో మెరుగైన రవాణా సౌకర్యం కొరకు హెచ్ సిటీ ద్వారా పలు ప్రాంతాల్లో ప్రతిపాదించి చేపట్టనున్న ఫ్లై ఓవర్ పనులను చేపట్టేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పరిశీలించారు. ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్న పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నివారణకు హెచ్ సిటి ద్వారా మొదటి ప్రాధాన్యత ఇచ్చి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదివారం ఆదేశించారు. టెండర్ పక్రియ పూర్తయ్యేవరకు భూసేకరణ పూర్తి చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించిన కమిషనర్ ఇలంబర్తి సూచించారు. నానా నగర్, ఖాజాగూడ జంక్షన్, ట్రిపుల్ ఐటీ, డీఎల్ఎఫ్, విప్రో, సరోజినీదేవి హాస్పిటల్ నుంచి ఖైరతాబాద్ వరకు వయా బంజారాహిల్స్ రోడ్డు నం.1, చింతల్ బస్తీ మీదుగా రోడ్డు వెడల్పు ఫీసిబిలిటీ, ప్రతిపాదించిన జంక్షన్ల వద్ద టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ ప్రాజెక్టు అధికారులతో కమిషనర్ పరిశీలించారు.

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

దంపతుల మధ్య ఘర్షణ

భర్త ఆత్మహత్యాయత్నం
చికిత్సకు గాంధీకి తరలింపు

బేగంపేట్, ఫిబ్రవరి 9: సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. భార్యతో గొడవపడి కోపంతో భర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. మార్కెట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ ప్యాట్నీలో ఉన్న కామాక్షి సిల్క్స్‌షాప్ లోనే భర్త నిప్పు పెట్టుకున్నాడు. భార్య మౌనిక షాప్ లో పని చేస్తుండగా, భార్యతో గొడవపడి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీంతో శ్రవణ్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న మార్కెట్ పోలీసులు షాప్ దగ్గరికి చేరుకున్నారు. తీవ్రంగా కాలిన గాయాలున్న శ్రవణ్ ను హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించారు. దుకాణంలో విని యోగదారులు ఉండగానే ఘటన జరగడంతో అందరూ ఒక్కసారిగా పరుగులు తీశారు. ఆత్మహత్యాయత్న ఘటనలో గాయపడిన శ్రవణ్ ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలికే చేరుకున్న మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్ మార్కెటింగ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఘటన జరిగిన తీరును తెలుసుకున్నారు. దుకాణంలో ఒక్కసారిగా దట్టమైన పొగలు కమ్ముకోవడంతో వినియోగదారులు ఉక్కిరి బిక్కిరయ్యారు. అప్పటికే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది దుకాణంలో చెలరేగిన మంటలను పొగలను అదుపులోకి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణ ఎందుకు జరిగిందనే విషయాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు రకాల వంటకాలు భోజన ప్రియులను నోరూరించాయి.

సంస్కృతిని చాటి చెప్పిన మహా దర్శకుడు కె.విశ్వనాథ్

తెలంగాణ తొలి శాసన సభాపతి
సిరికొండ మధుసూదనాచారి

నటి సబితకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి, ఫిబ్రవరి9: మన సంస్కృతి, సంప్రదాయాలపై అనేక సినిమాలను రూపొందించిన మహా దర్శకుడు డాక్టర్ కే విశ్వనాథ్ అని తెలంగాణ తొలి శాసన సభాపతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. కళానిలయం సాంస్కృతిక సంఘ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ దర్శకుడు, పద్మశ్రీ కళా తపస్వి డాక్టర్ కె.విశ్వనాథ్ 93వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిరికొండ మధుసూదనాచారి హాజరై విశ్వనాథ్ పురస్కారాన్ని అందాల నాట్యతార సబితకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలపై విశ్వనాథ్ సినిమాలు తీయకపోతే మనమంతా పరాయీకరణకు గురయ్యే వారమని తెలిపారు. తన సినిమాల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రపంచాన్ని చాటిచెప్పిన మహా దర్శకుడు డాక్టర్ విశ్వనాథ్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మేము సైతం యువసేన ఫౌండేషన్ నిర్వాకురాలు స్వప్న శ్రీనివాస్, దైవజ్ఞ శర్మ నిర్వాహక సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పుష్పలత సురేందర్, సినీ నిర్మాత మురళీధర్, సంఘ సేవకుడు వీర భోగ వసంత రాయులు భరతనాట్య, కూచిపూడి గురువులు శ్వేత ప్రియ, లావణ్య, కామేశ్వరి, ప్రతిభా రాజ్ గౌడ్, రేణుక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

పలువురు ప్రముఖులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9: యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విద్యా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన యూజీసీ ముసాయిదాపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ వినోద్ కుమార్, రిటైడ్ విద్యాధికారి విజయ్ కుమార్, విద్యావేత్త మనోజ్, ప్రొఫెసర్ నతాన్యేలు తదితరులు హాజరై ప్రసంగించారు. యూజీసీ ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని, విశ్వ విద్యాలయంలో గవర్నర్‌కి ప్రాధాన్యత ఇవ్వడం భారత రాజ్యాంగ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమైనదని అన్నారు. విశ్వవిద్యాయాల్లో రాజకీయ జోక్యం ఉండకూడన్నారు. సురేందర్ రెడ్డి, గ్రేటర్ కన్వీనర్ గుండు దయనంద్, నాయకులు కొండా స్వామి, అనిల్ కుమార్, చారి, ఆర్.కే.భూపాల్, జానకి రెడ్డి, శ్యామల, రాంబాబు, లక్ష్మణ్ తదితరలు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్

సాధారణ క్యాన్సర్ల కంటే ఊపిరి తిత్తులవే అధికం

యశోద గ్రూప్ హాస్పిటల్స్
ఎండీ జీఎస్ రావు

హైటెక్ సిటీ లోని యశోద హాస్పిటల్ లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ పల్మనాలజీ సదస్సులో భాగంగా బ్రాంకస్ 2025 కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ జీఎస్ రావు

మాదాపూర్, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): ప్రపంచ వ్యాప్తంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ తో 1.8 మిలియన్ల జనాభా మృతి చెందుతున్నట్లు యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ జీఎస్ రావు అన్నారు. మాదాపూర్ లోని యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పల్మనాలజీ సదస్సు, లైవ్ వర్క్ షాప్ పేరుతో బ్రాంకస్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ జీఎస్ రావు విచ్చేసి యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి, పల్మనాలజీ వైద్య నిపుణులు, డాక్టర్ హరికిషన్ లతో కలిసి ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ తో ఏటా 1.8 మిలియన్ల మంది జనాభా మృతి చెందుతునట్లు తెలిపారు. ఇతర క్యాన్సర్ మరణాల కంటే ఇది చాలా ఎక్కువ అని ఆయన అన్నారు. ఇందుకు గల కారణం ఊపిరితిత్తుల క్యాన్సర్ చాలా ఆలస్యంగా 3 లేదా 4 వ దశలలో నిర్ధారణ కావడమే దీనికి గల కారణమన్నారు. భారతదేశంలో అన్ని క్యాన్సర్ కేసులలో ఊపిరితిత్తుల క్యాన్సర్ దాదాపు 8.5 శాతం క్యాన్సర్ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. దేశంలో మూడు ప్రధాన క్యాన్సర్ కేసులలో ఊపిరి తిత్తుల క్యాన్సర్ ఒకటి అని చెప్పారు. ప్రపంచంలో అంతకంతకు పుట్టుకొస్తున్న కొత్త మహమ్మారులు, ఊపిరి తిత్తుల వ్యాధులు, సుదీర్ఘ కాలంగా వేధించే ఉబ్బస వ్యాధి నుంచి కరోనా వైరస్ వరకు అనేక ఊపిరితిత్తుల వ్యాధుల వరకు ఉపశమనం కలిగించే బ్రాంకియాల్ థర్మో ప్లాస్టి, ఇంటర్వెన్షనల్ బ్రాంకో స్కోపిక్ థర్మల్ వెపోర్ అబ్లేషన్ (బీవీటీఏ) లాంటి అత్యాధునిక వైద్య విధానాలను దక్షిణాదిలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత యశోద హాస్పిటల్ వ్యాధులకు దక్కిందన్నారు. బ్రాంకియాల్ థర్మో ప్లాస్టి విధానం ద్వారా అనేక మంది రోగులకు శాశ్వత చికిత్స చేసిన ఘనత కూడా యశోద హాస్పిటల్స్ కే దక్కుతుందన్నారు. అనంతరం, యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, పవన్ గోరుకంటి మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికలపై ఉత్తమ బహుమతులను గెలుచుకోవడం ద్వారా యశోద హాస్పిటల్స్ పల్మనాలజీ విభాగం దేశం లోనే అత్యుత్తమమైనదిగా నిరూపించబడినట్లు తెలిపారు. యశోద హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజీలో అతి పెద్ద లాంగ్ విజన్ వంటి కొత్త సాంకేతికతను మరోసారి విజయవంతంగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కృత్రిమ మేధస్సు ఆధారిత ముందస్తు ఊపిరి తిత్తుల క్యాన్సర్లను గుర్తించే పరికరంతో పాటు అనేక ఇతర కొత్త సాంకేతిక వైద్య విధానాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు రోజులపాటు కొనసాగిన ప్రపంచ స్థాయి సదస్సులో ప్రాథమిక స్థాయి నుంచి అత్యంత క్లిష్టమైన ఆధునిక వైద్య విధానాల గురించి చర్చించడంతో పాటు శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు కార్యనిర్వాహక కార్యదర్శి, యశోద హాస్పిటల్స్ పల్మనాలజీ వైద్య నిపుణులు డాక్టర్ హరికిషన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, ప్రొఫెసర్ ఫేలిప్స్ హెర్ట్, జర్మనీ థొరాక్స్ క్లినిక్ ప్రొఫెసర్ కైల్ హోగార్ట్, యూనివర్సిటీ ఆఫ్ చికాగో (యూఎస్ఏ) డాక్టర్ మైకేల్ ప్రిచెట్లతో పాటు 3 వేల మంది వైద్య నిపుణులున్నారు.

అక్రమ వలసల పేరుతో భారతీయులకు సంకెళ్లు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని ప్రతి ఒక్కరు ఖండించాలి
- ఆర్టీసీ క్రాస్ రోడ్ లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన

ట్రంప్ వైఖరిని వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 9: భారతీయ వలసదారుల పట్ల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న అమానుష వైఖరిని ఖండిస్తూ హైదరాబాద్ లోని ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జాతీయ నాయకుడు బి.వెంకట్ మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న వైఖరి అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమని అన్నారు. అక్రమ వలసదారుల పేరుతో భారతీయుల ఆశలకు సంకెళ్లు వేసి సైనిక విమానంలో కుక్కి పంజాబ్ లోని అమృత్ సర్ విమానాశ్రయంలో ఫిబ్రవరి 5న 104 మందిని పంపించారన్నారు. భారతీయుల పట్ల వ్యవహరించిన వైఖరి యుద్ధ ఖైదీల పట్ల కూడా ఉండదన్నారు. అమెరికాలో అక్రమ వలసదారులు ఉంటే ఐక్యరాజ్యసమితితో పాటు ఏ దేశాల నుంచి వలసదారులు వచ్చారో.. ఆదేశాలకు సమాచారం ఇవ్వాలన్నారు. గౌరవంగా వారిని పంపించాలని పేర్కొన్నారు. కానీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయుల పట్ల ఈ రకంగా వ్యవహరిస్తున్న కూడా భారత ప్రధానమంత్రి కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. పార్లమెంట్ లో భారత విదేశాంగ మంత్రి జయశంకర్ అమెరికా వైఖరికి వత్తాసు పలికి 140 కోట్ల మంది భారతీయుల ఆత్మగౌరవాన్ని కించపరిచారని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరగడం వలన ఉద్యోగాలు లేక పేదలు ట్రావెల్ ఏజెంట్ల మాయలో పడి లక్షలు ఖర్చుచేసి అమెరికా వెళ్ళి ఇలాంటి పరిస్థితి తెచ్చుకున్నారని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరగడానికి కారణం బీజేపీ అనుసరిస్తున్న విధానాలే అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, సీపీఎం పార్టీ గ్రేటర్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ రావు నగర కమిటీ సభ్యులు, కుమారస్వామి, ఎం.అజయ్ బాబు, జి.నరేశ్, కె.అజయ్ బాబు, సి.మల్లేశ్, జి.కిరణ్, అశోక్ రెడ్డి, పి.విమల, ఎండి జావేద్, టి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.